నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 22 ఏప్రిల్ 2024 | SANGAREDDY

అమ్మ దయతో...అందరికీ శుభం కలగాలి

- పెద్దమ్మ తల్లికి పూజలు చేసిన హరీశ్‌రావు

చిన్నకోడూరు, ఏప్రిల్ 21: సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని గంగాపూర్‌లో నిర్వహిస్తున్న పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొని అమ్మవారిని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు, దీవెనలతో మనం చేసే కార్యం సఫలం కావాలని, గంగాపూర్ ప్రజలకు అన్నింటా శుభం చేకూరాలన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు. ముదిరాజ్ సంఘ ప్రతినిధులు, గ్రామస్తులు హరీశ్‌రావును సన్మానించారు.

గంగాపూర్‌లో పెద్దమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



పెద్దకోడూరులో మహిళా రైతుతో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- కేసీఆర్ హయాంలో గిట్ల ఉండేనా..
- రైతులను కాంగ్రెస్ పట్టించుకోవట్లే..
- తొందరపడి తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దు
- రూ. 2,203 మద్దతు ధర ఇప్పిస్తా..
- అధికారులతో మాట్లాడిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూర్, ఏప్రిల్ 21: కేసీఆర్ ఉన్నప్పుడు గిట్ల ఉండేనా..రైతులు అధైర్యపడొద్దు. తొందరపడి తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవద్దు. రూ. 2,203 మద్దతు ధర ఇప్పిస్తా.. అధికారులతో మాట్లాడి అండగా ఉంటానని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు రైతులకు స్పష్టం చేశారు. చిన్నకోడూరు మండలం పెద్దకోడూర్ గ్రామ పరిధిలోని మెట్టుబండల వద్ద కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం వడ్ల కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలన్నారు. 15 రోజుల నుంచి వడ్లు పెట్టుకొని ఇక్కడే ఉంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. రైతులు 15 రోజులుగా కేంద్రంలో ధాన్యం ఉంచినా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం సిగ్గు చేటన్నారు. వర్షంతో ధాన్యం తడిచినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే మద్దతుధరకు ధాన్యం కొని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో ఇలాంటి కష్టాలు లేవని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇటు కరెంటు అటు నీళ్లు లేక పంటలు ఎండిపోయినట్లు తెలిపారు. మోటార్లు కాలిపోవడంతో రైతులకు పెనుభారంగా తయారైందన్నారు. చాలామంది రైతులకు రైతుబంధు పడలేదన్నారు. ప్రభుత్వం రైతులను అసలు పట్టించుకోవడమే లేదని హరీశ్‌రావు అన్నారు.

రైతులతో ముచ్చటించిన హరీశ్‌రావు

- రైతు రగునవ్వ మాట్లాడుతూ..15 రోజుల నుంచి ఇక్కన్నే ఉంటున్నం సార్... వడ్లు కొనే నాథుడే లేడు. కేసీఆర్ సార్ ఉన్నప్పుడు అన్ని ఇచ్చిండు... ఇప్పుడు ఏం లేదు...అసలు రైతులను పట్టించుకోవడమే లేదు...
- రైతు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... కరెంట్ తిప్పలతో రెండుసార్లు మోటార్ కాలిపోయి రూ.22 వేలు ఖర్చు అయింది. రైతుబంధు కాదు.. ఏదీ లేదు సార్.. మాకు తిప్పలు అయితంది. కేసీఆర్ పెద్దమనిషి ఉన్నప్పుడు అన్ని ఉండే సార్... ఆ సారే మల్ల రావాలి సార్...!!
- రైతు నారాయణస్వామి మాట్లాడుతూ... వడ్లు కొనక చాలా తిప్పలు అవుతుంది సార్.. 15 రోజులు అయినా వడ్లు కొంటలేరు... కేసీఆర్ సార్ ఉన్నప్పుడు గీ బాధలు అస్సలే లేవు సర్...!! గీ కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నీ తిప్పలే..
- హరీశ్‌రావు మాట్లాడుతూ... రైతు రుణమాఫీ రూ. 2లక్షలు అన్నాడు ఇయ్యలే.. రైతుబంధు అన్నాడు ఇయ్యలే.. వడ్లకు బోనస్ రూ.500 అన్నాడు ఎగొట్టిండు.. అస్సలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మొద్దు... కేసీఆర్ హయాంలో గిట్ల ఉండేనా..అన్నీ రైతుల ముంగిటొచ్చినయ్ అని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన మోసాలను వారికి వివరించారు.

బీఆర్ఎస్‌కు మెదక్ కంచుకోట

పార్టీ ఆవిర్భావం నుంచి ఇక్కడ వరుస విజయాలు

2004 నుంచి 2019 వరకు ఐదుసార్లు జయకేతనం

- డబుల్ హ్యాట్రిక్ దిశగా దూసుకుపోతున్న బీఆర్ఎస్
- గులాబీ అధినేత కేసీఆర్ మార్గదర్శనంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సుడిగాలి పర్యటన
- ప్రచారంలో ప్రతిపక్షాల వైఫల్యాలను ఎండగడుతున్న వైనం

సిద్దిపేట, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి): మెదక్ పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్‌కు కంచుకోట. పార్టీ ప్రారంభించిన నాటి నుంచి వరుస విజయాలతో ఇక్కడ బీఆర్ఎస్ దూసుకుపోతోంది.ప్రత్యర్థి పార్టీలకు అందనంత దూరంగా బీఆర్ఎస్ ముందున్నది. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లా ఈపార్లమెంట్ పరిధిలోనే ఉన్నాయి. ప్రతిసారి ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గం కీలకంగా మారుతుంది. 2009 పార్లమెంట్ ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గంలో వచ్చిన మెజార్టీ ఆధారంగానే ఆనాడు విజయశాంతి విజయం సాధించింది. దీంతో ప్రతి ఎన్నికల్లోనూ సిద్దిపేట మెజార్టీపైనే అందరి దృష్టి ఉంటుంది. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున సిద్దిపేట మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇక బీజేపీ నుంచి దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, కాంగ్రెస్ నుంచి నీలం మధు పోటీ పడుతున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే పోరు నడుస్తోంది. ఇక్కడ కాంగ్రెస్ మూడో స్థానంలోనే ఉంది అని చెప్పాలి. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మెదక్ పార్లమెంట్ స్థానం పరిధిలోని ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు, పార్టీ కార్యకర్తలకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తూ తనదైన శైలీలో ప్రచారంలో ముందుకు వెళ్తున్నారు. ప్రతి మండల కేంద్రాల్లో పార్టీ సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, గూడెం మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జడ్పీ చైర్పర్సన్లు వేలేటి రోజాశర్మ, హేమలత తదితర ముఖ్యనాయకులు నిత్యం ప్రచారంలో ఉంటూ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తున్నారు.

బీఆర్ఎస్ పార్టీకి విజయాలను అందించిన గడ్డ

బీఆర్ఎస్ పార్టీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు అనేక విజయాలను అందించింది మెతుకు గడ్డ. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత 2014, 2018, 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఆధిక్యతను కనబర్చింది. 2004 నుంచి 2019 వరకు వరుసగా ఐదుసార్లు మెదక్ పార్లమెంట్ స్థానాన్ని గెలుచుకుంది. 2014,2019 ఎన్నికల్లో రెండు సార్లు జహీరాబాద్ పార్లమెంట్ నుంచి బీఆర్ఎస్ విజయం సాధించింది. ఇక ఉమ్మడి జిల్లాలో 10 శాసనసభ స్థానాలకు 2014లో 8 స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకోగా, జహీరాబాద్, నారాయణఖేడ్ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంది. నారాయణఖేడ్ ఎమ్మెల్యే అనారోగ్య కారణంతో మరణించగా అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. 2016లో జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి గెలుపొందారు. దీంతో 10కి 9పోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. 2018 ఎన్నికల ఫలితాల్లో 10 శాసనసభ స్థానాలకు 9 చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఒక్క సంగారెడ్డిలో మాత్రమే కాంగ్రెస్ గెలిచింది. తదనంతరం దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి అనారోగ్య సమస్యల కారణంగా మృతి చెందడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. 2020లో ఉప ఎన్నిక జరిగింది. ఈ ఉప ఎన్నికల్లో స్పల్ప ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ ఓడిపోయింది. ఈ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు 1,079 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అంతకుముందు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడు జిల్లా పరిషత్‌లను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. అన్ని మండల పరిషత్‌లతో పాటు, గ్రామాల సర్పంచ్‌లు ఇలా అన్నింటా బీఆర్ఎస్ పార్టీ ముందు వరుసలో నిలిచింది. జిల్లాలో 95 శాతానికి పైగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఉన్నారు. 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పది శాసనసభ స్థానాలకు ఏడు చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ మూడు చోట్ల విజయం సాధించింది. 2014, 2018, 2023 శాసనసభ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ విజయాన్ని సొంతం చేసుకుంది. 2014లో రెండు, 2018లో ఒక స్థానం, 2023లో మూడు స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంది. పార్లమెంట్ ఫలితాలను చూస్తే 2004 నుంచి నేటి వరకు బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి గెలుచుకుంటూ వస్తుంది. 2004లో ఎ.నరేంద్ర, 2009లో విజయశాంతి, 2014లో కె.చంద్రశేఖర్‌రావు, 2014(ఉప ఎన్నికలో) కొత్త ప్రభాకర్‌రెడ్డి, 2019లో కొత్త ప్రభాకర్‌రెడ్డి (తెలంగాణ రాష్ట్ర సమితి) నుంచి ఎన్నికయ్యారు.

మెదక్ లోకసభ నుంచి ఇప్పటి వరకు ఎన్నికైన వారు ఇలా...

1952లో మెదక్ లోక్‌సభ ఏర్పడింది. 1952లో జయసూర్య (పీపుల్స్ డెమోక్రిటిక్ ఫ్రంట్ (హైదరాబాద్), 1957, 1962లో పి.హన్మంత్‌రావు, 1967లో సంగం లక్ష్మీ బాయి (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ), 1971 మల్లికార్జున్‌గౌడ్ (తెలంగాణ ప్రజా సమితి) 1977లో మల్లికార్జున్‌గౌడ్, 1980లో ఇందిరాగాంధీ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ) 1984లో మాణిక్‌రెడ్డి (టీడీపీ) 1989, 1991, 1996, 1998లో ఎం.బాగారెడ్డి (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ), 1999లో ఏ.నరేంద్ర (భారతీయ జనతా పార్టీ), 2004లో ఎ.నరేంద్ర, 2009లో విజయశాంతి, 2014లో కె.చంద్రశేఖర్‌రావు, 2014(ఉప ఎన్నికలో) కొత్త ప్రభాకర్‌రెడ్డి, 2019లో కొత్త ప్రభాకర్‌రెడ్డి (తెలంగాణ రాష్ట్ర సమితి) నుంచి ఎన్నికయ్యారు.

2014 లోక్‌సభ ఎన్నికల్లో

పార్టీ	అభ్యర్థి	ఓట్లు	శాతం
బీఆర్ఎస్	కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు	6,57,492	55.2 శాతం
కాంగ్రెస్	పి.శ్రవణ్‌కుమార్‌రెడ్డి	2,60,463	21.9 శాతం
బీజేపీ	చాగండ్ల నరేంద్రనాథ్	1,81,804	15.3 శాతం

బీఆర్ఎస్ అభ్యర్థి 3,97,029 ఓట్ల మెజార్టీతో విజయం

2014 ఉప ఎన్నికల్లో

పార్టీ	అభ్యర్థి	ఓట్లు	శాతం
బీఆర్ఎస్	కొత్త ప్రభాకర్‌రెడ్డి	5,71,810	55.24
కాంగ్రెస్	వాకిటి సునీతా లక్ష్మారెడ్డి	2,10.524	20.34
బీజేపీ	జగ్గారెడ్డి	1,86,343	18.00 శాతం

బీఆర్ఎస్ అభ్యర్థి 3,61,286 ఓట్ల మెజార్టీతో విజయం

2019 ఎన్నికల్లో

పార్టీ	అభ్యర్థి	ఓట్లు	శాతం
బీఆర్ఎస్	కొత్త ప్రభాకర్‌రెడ్డి	5,96,048	51.82 శాతం
కాంగ్రెస్	గాలి అనీల్‌కుమార్	2,79,621	24.31 శాతం
బీజేపీ	ఎం.రఘునందన్‌రావు	2,01,567	17.52 శాతం

బీఆర్ఎస్ అభ్యర్థి 3,16,427 ఓట్ల మెజార్టీతో విజయం

మెదక్ లోక్‌సభ స్థానం బీఆర్ఎస్ కంచుకోట		
సంవత్సరం	పార్టీ	వచ్చిన ఓట్లు
2004	బీఆర్ఎస్	4,53,738
2009	బీఆర్ఎస్	3,88,839
2014	బీఆర్ఎస్	6,57,492
2014(ఉప ఎన్నిక)	బీఆర్ఎస్	5,71,810
2019	బీఆర్ఎస్	5,96,048

మెదక్ లోక్‌సభ పరిధిలో ఏడు శాసనసభ స్థానాలు

మెదక్ లోక్‌సభ పరిధిలో ఏడు శాసనసభ స్థానాలు ఉన్నాయి. వీటిలో ఆరు చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఒకచోట కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నారు. గజ్వేల్ నుంచి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, సిద్దిపేట నుంచి తన్నీరు హరీశ్‌రావు, దుబ్బాక నుంచి కొత్త ప్రభాకర్ రెడ్డి, నర్సాపూర్ నుంచి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి, పటాన్‌చెరు నుంచి గూడెం మహిపాల్‌రెడ్డి, సంగారెడ్డి నుంచి చింతా ప్రభాకర్ బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక మిగిలిన మెదక్ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక్క స్థానం మినహా మిగిలిన చోట్ల బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో గులాబీ పార్టీకి కంచుకోట అని చెప్పాలి. మెదక్ పార్లమెంట్ స్థానంలో ఎగిరేది కూడా గులాబీ జెండానే... 2004 నుంచి వరుసగా బీఆర్ఎస్ గెలుచుకుంటూ వస్తుంది.

రైతులు ధైర్యం కోల్పోవద్దు

మద్దతు ధర ఇచ్చేవరకు ప్రభుత్వంతో కొట్లాడుదాం



మెదక్ జిల్లా తొనిగండ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లను పరిశీలిస్తున్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

- కాంగ్రెస్ పార్టీ రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలి
- వందరోజుల్లో హామీల అమలు ఏమైంది...
- మాటతప్పిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి
- ధాన్యం తడిచి మొలకెత్తినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- తొనిగండ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

రామాయంపేట, ఏప్రిల్ 21: మద్దతు ధర లేదని రైతులు ధైర్యాన్ని కోల్పోవద్దని ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చే వరకు కొట్లాడుదామని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట నుంచి మెదక్ వెళ్తుండగా మార్గమధ్యంలోని రామాయంపేట మండలం తొనిగండ్లలోని రోడ్డు పక్కనే ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర ఇస్తుందా, క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుందా, కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పిస్తుందా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. కనీస మద్దతు ధర లేదని, కొనుగోలు కేంద్రాల వద్ద సరైన వసతులు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించడం లేదని రైతులు చెప్పారు. ధాన్యం తీసుకొచ్చిన రైతు సిద్దయ్య హరీశ్‌రావుతో మాట్లాడుతూ కష్టానికి తగిన ఫలితం లేదని, ధాన్యం కొనే దిక్కే లేదని, ధాన్యం కొంటారని 15 రోజుల నుంచి కొనుగోలు కేంద్రం వద్దే ఉంటున్నాం సర్ అని తెలిపాడు. మరో మహిళా రైతు నాగమణి మాట్లాడుతూ రోజూ ధాన్యం కొంటారని పనులన్నీ వదులుకొని కాపలా కాస్తున్నామని, వర్షాల వల్ల ధాన్యం తడిసిపోతుందని మొరపెట్టుకుంది. మరో రైతు మల్లేశం మాట్లాడుతూ కేసీఆర్ సార్ ఉన్నప్పుడు ఇన్ని కష్టాలు లేవు సార్ అని తెలిపాడు.

ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవాలి

అన్నదాతలు ధైర్యాన్ని కోల్పోవద్దని, మీకు అండగా మేమున్నామని హరీశ్‌రావు ధైర్యం చెప్పారు. రైతులు కొనుగోలు కేంద్రానికి 15 రోజులుగా ధాన్యం తెచ్చినా ప్రభుత్వం కొనకపోవడం విడ్డూరంగా ఉన్నదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయాల మీద ఉన్న ప్రేమ పాలనపై లేకపోవడం సిగ్గుచేటన్నారు. రైతుల బాధలు తెలుసుకుని న్యాయం చేయాలని సీఎంకు హితవు పలికారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాత రాజకీయాలు చేసుకో అని సూచించారు. వంద రోజుల్లో హామీలన్నీ నెరవేరుస్తానన్న కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి మొలకెత్తుతున్నా ప్రభుత్వం తూకాలు పెట్టకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ పాలనలోనే బాగుందని, అప్పుడు ఇన్ని కష్టాలు లేవని రైతులే నేరుగా చెప్పడం బాధగా ఉన్నదన్నారు. రైతుల కండ్లల్లో కన్నీరు తుడిచే వరకు మా పోరాటం ఆగదని హరీశ్‌రావు తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావు వెంట రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సంగు స్వామి, నిజాంపేట మాజీ సర్పంచ్ కొమ్మాట సత్యనారాయణ, అబ్దుల్ అజీజ్ తదితరులు ఉన్నారు.

మహిళా రైతును ఓదారుస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

పూజలందుకుంటున్న అమ్మవారు

కిటకిటలాడిన ఏడుపాయల

పాపన్నపేట, ఏప్రిల్ 21: పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవానీ మాతను ఆదివారం భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకరశర్మ, పార్థివ శర్మ, మురళీధర్, రాజశేఖర్ ప్రత్యేక పూజలు నిర్వహించగా, పాపన్నపేట ఎస్సై నరేశ్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

మాట తప్పడం రేవంత్ నైజం

- విలేకరులతో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

మెదక్, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ): మాట తప్పడం రేవంత్ నైజమని, అబద్ధాలు ఆడడంలో రేవంత్‌కు ఆస్కార్ అవార్డు ఇవ్వాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం మెదక్ బీఆర్ఎస్ కార్యాలయంలో నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, చంద్రాగౌడ్, ర్యాకల శేఖర్‌గౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. శనివారం రేవంత్‌రెడ్డి మెదక్ వచ్చి ఒక్కటన్నా మెదక్‌కు పనికి వచ్చే మాట మాట్లాడిండా.. రేవంత్‌రెడ్డి నిలబడ్డ రాందాస్ చౌరస్తా కేసీఆర్ చేసిందేనని, మెదక్‌కు ఏం చేశాడో చెప్పడానికి ఇదే ఒక సాక్ష్యమన్నారు. కాంగ్రెస్ హయాంలో రాందాస్ చౌరస్తా ఎలా ఉండే ఈరోజు ఎలా ఉందో చూడాలన్నారు. నువ్వు నామినేషన్ వేయడానికి వచ్చిన కలెక్టరేట్ ఎక్కడిది.. మెదక్ జిల్లా ఎవరూ చేశారు.. నువ్వు ర్యాలీలో చూస్తున్న కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, ఫోర్‌లేన్ రోడ్లు, రాందాస్ చౌరస్తా, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, మంజోజిపల్లి బ్రిడ్జి కనబడలేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ఘనపూర్ ప్రాజెక్టుకు మహర్దశ వచ్చిందని తెలిపారు. ఏడుపాయల అమ్మవారికి కేసీఆర్ రూ.100 కోట్లు ఇస్తే ఇచ్చిన నిధుల జీవోను రద్దు చేసి మెదక్‌కు అన్యాయం చేసింది రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. మెదక్‌లో యూనివర్సిటీలు, రైళ్లు వచ్చాయంటే అది కేసీఆర్ పుణ్యమేనన్నారు. ఇక్రిశాట్ ఇందిరాగాంధీ ఇచ్చారన్నారు. కానీ ఇక్రిశాట్ తెచ్చింది ఆ నాటి ప్రధానీ చరణ్ సింగ్ అని గుర్తుచేశారు. బీహెచ్ఈఎల్ 1952లో ప్రారంభిస్తే ఇందిరాగాంధీ మెదక్ నుంచి పోటీ చేసింది 1980లో అన్నారు. ఏదీ పడితే అది అబద్ధాలు ఆడుతున్నాడు సీఎం రేవంత్, ఒక సీఎం మాట్లాడే మాటలేనా, ఇది పద్ధతి కాదు సంస్కారం కాదన్నారు.

మంత్రులకు అహంకారం నెత్తికెక్కింది...

కాంగ్రెస్ మంత్రులకు అహంకారం నెత్తికెక్కిందని, నేల మీదికి రావాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పార్లమెంట్‌కు పోవాలని హరీశ్‌రావు తెలిపారు. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న రేవంత్ మాట తప్పారన్నారు. హరీశ్‌రావు ఎత్తు గురించి నీకేం పని.. నా గురించి పక్కన పెట్టి రైతులు పడుతున్న తిప్పల గురించి ఆలోచించాలన్నారు. రైతులు చనిపోతే రైతు కుటుంబాన్ని సీఎం గానీ, మంత్రులు కానీ ఇప్పటివరకు పరామర్శించిన పాపాన పోలేదన్నారు. సీఎం రేవంత్ కేసీఆర్‌ను తిట్టుడే పనిగా పెట్టుకున్నాడు.. కేసీఆర్ తిట్టుకుంటూ ఎంతసేపు కాలక్షేపం చేస్తావని ఘాటుగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల మీద దృష్టి పెట్టి, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, లేకపోతే ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క ఎగవేత, దాటవేతలో పోటీ పడుతున్నారన్నారు.

జోగిపేటలో దారుణం

చోరీ చేస్తుండగా చూశాడని బాలుడి హత్య

- సెల్ టవర్ పైకెక్కి నిందితుడి హల్‌చల్..
- ఆ తర్వాత అక్కడే ఉరేసుకుని ఆత్మహత్య
- నాగరాజుది మొదటినుంచి నేరచరిత్రే...
- సంగారెడ్డి జిల్లా జోగిపేటలో ఘటన

అందోల్, ఏప్రిల్ 21: సంగారెడ్డి జిల్లా జోగిపేటలో ఆదివారం దారుణం చోటుచేసుకుంది. చోరీ చేస్తుండగా చూసి పట్టించాడనే కక్షతో ఓ బాలుడిని అంతమొందించాడు. ఆపై బంధువులకు భయపడి సెల్‌టవర్ ఎక్కి నానా హంగామా చేయడంతో పాటు అడ్డం వచ్చిన వారిపై కత్తితో దాడిచేసి చివరకు అదే సెల్ టవర్‌పై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జోగిపేటలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఘటనకు సంబంధించి పోలీసులు, బాలుడి కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. జోగిపేటకు చెందిన వడ్డె నాగరాజు (35) పట్టణంలో చోరీలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో పలు చోరీలు చేసి జైలుకు వెళ్లి రావడం, స్థానిక వ్యాపారులను బెదిరించడం దినచర్యగా మార్చుకున్నాడు. శుక్రవారం దుకాణంలో కేబుల్ వైర్లు చోరీ చేయగా శేఖర్(13) అనే బాలుడు చూసి విషయం స్థానికులకు చెప్పాడు. దీంతో అతడిపై కోపం పెంచుకున్న నాగరాజు శనివారం సాయంత్రం బాలుడిని ఊరి బయటకు తీసుకెళ్లి గొంతు నులిమి... ఆపై రాయితో కొట్టి చంపి బావిలో పడేశాడు. అనంతరం ఈ విషయాన్ని బాలుడి తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో వారు కొడతారనే భయంతో శనివారం రాత్రి సెల్‌టవర్ ఎక్కి కూర్చున్నాడు. అతడిని కిందకు దించేందుకు వెళ్లిన ఇద్దరిపై కూడా కత్తితో దాడిచేసి గాయపర్చాడు. కిందకు దిగితే తనకు శిక్ష తప్పదని భావించి సెల్‌టవర్ కేబుల్ కట్‌చేసి అక్కడే ఉరివేసుకున్నాడు. ఆదివారం సాయంత్రం వరకు నాగరాజు కదలకుండా ఉండడంతో పోలీసులు స్థానికుల సాయంతో టవర్ ఎక్కి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. దీంతో అతడి మృతదేహాన్ని దించి జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాలుడు శేఖర్ మృతదేహాన్ని సైతం బావిలో గుర్తించిన పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు నాగరాజు శనివారం రాత్రి సైతం జోగిపేటకు చెందిన ప్రకాశ్ అనే వ్యాపారిపై దాడిచేసి తల పగులగొట్టడంతో ఆయన దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయంపై వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో సైతం ఇలాంటి ఘటనలు జరగ్గా పోలీసులకు ఫిర్యాదు చేసిన సందర్భాలున్నాయని వ్యాపారులు తెలిపారు.

దవాఖానలో చికిత్స పొందుతున్న వ్యాపారి ప్రకాశ్

నాగరాజు చేతిలో హత్యకు గురైన శేఖర్(ఫైల్)